# అనగనగా ఒక గితివ



ఛీ మీరిలాంటి వారనుకోలేదు' చరిత నాకేసి చురచురా చూస్తూ అంది.

సడెన్‌గా తనలా అనేసరికి మబ్బూ మశానం లేకుండా నడినెత్తిన పిడుగు పడినట్టుగా అనిపించింది నాకు.

సంగతేమిటో బోధపడి ఛస్తేగా?

'దేన్ని గురించోయ్ నువ్వంటోంది?' అనడిగాను కాస్త ఆశ్చర్యంగా, మరికాస్త అయోమయంగా.

'మీ బుద్ధి గురించి' అని మూతి బిగించింది.

'నా బుద్ధి గురించా? నా బుద్ధికేమైందిపుడూ?' పేపర్లోని వీక్లీని పక్కన పడేసి బుర్ర గీరుకుంటూ అడిగాను.

'నేను చూళ్ళేదనుకున్నారేమో - నేను మీ వాలకం అంతా గమనించాన్లెండి' అంది చిత్ర విచిత్రంగా చేతులు తిప్పుతూ.

'అబ్బ! సంగతేంటో కాస్త అర్థమయ్యేలా చెప్పవోయ్' అన్నాను చిరుకోపంగా.

అసలే అందమైన భార్య. అందునా ఆర్రోజుల వియోగం తర్వాత 'ప్యారీ మిఠాయి'లా నోరూరిస్తున్న భార్య. చీకటి పడితే తప్ప చేతికి చిక్కదు కాబట్టి-

పగలా ఊసెత్తితే పళ్ళు నూరే రకం కాబట్టి - ఎలాగో ఉగ్గబట్టుకుని ఎంతటెంతట చీకటి పడుతుందా అని ఎదురు చూస్తున్నాను, ఆర్రోజుల తర్వాత ఆ రోజే క్యాంపు నుండి తిరిగొచ్చిన నేను.

ఆశెక్కువ కాబట్టి ఆ సమయంలో చెలరేగిపోతుంటానే తప్ప, ఉత్తప్పుడు నేను చాలా బుద్ధిమంతుణ్ణి. మహా శాంతస్వభావుణ్ణి. అందుకే చిరుకోపమే తప్ప, పెనుకోపం అనేది నా దగ్గరక్కూడా రాదెప్పుడూ.

'అబ్బ! నేరని నంగిలా ఎంత అమాయకంగా అడుగుతున్నారండీ? నేనంతా గమనించాన్లెండి' అంది చరిత నా చిరుకోపాన్ని పట్టించుకోకుండా - అప్పటిక్కూడా ఇంకా సంగతేంటో చెప్పకుండా.

'అసలు దేన్ని గురించోయ్ నువ్ మాట్లాడుతోంది' అన్నాను కాళ్ళు పైకెత్తి సోఫాలోనే బాసింపట్లు వేసుక్కూర్చుంటూ.

'ఒక పక్క వీక్లీ చదువుతున్నట్టు నటిస్తూనే ఆ జామకాయల పిల్లకేసి ఏమిటా దొంగచూపులు?' అంది చరిత.

నేను... జామకాయల పిల్లకేసి... దొంగచూపులు చూశానా?

మతిపోయినట్టయింది నాకు.

నేనసలు వీక్లీలోంచి తలైనా పైకెత్తితే గదా - ఆ పిల్లకేసి దొంగ చూపులో, దొరచూపులో, ఇంకో చూపులో చూడ్డానికి?

'ఏయ్ జాంకాయలూ' అని తను గట్టిగా అరిచింది కాబట్టి - ఆ మీదట వీధరుగు మీదకెళ్ళి 'రూపాయికెన్ని?' అని అడగటం కూడా నాకు వినిపించింది కాబట్టి - 'ఓహో జాంకాయలు కొంటోంది కాబోలు' అనుకున్నానే తప్ప - అంతకు మించి ఏ పాపమూ తెలియదు నాకు. కనీసం అటుకేసి తల తిప్పిన పాపాన్ని కూడా పోలేదు.

అలాంటిదా అమ్మాయికేసి దొంగచూపులు చూశానంటూ అంత అభాండమా?

శివశివా!

ఆ ఆఖరి నాలుగక్షరాలూ పైక్కూడా అన్నాను.

ఆ మీదట 'నువ్విప్పుడు జాంకాయలు కొన్నావని తెలుసు గాని, అమ్మిన అమ్మాయి కేసి నేసలు చూడనే లేదు' అన్నాను. 'ఇంత ఘోరమైన అభాండం వెయ్యడం - తగునా నీకిది భామా?' అన్నట్టుగా చూస్తూ.

'బుకాయించమాకండి. నేనక్కణ్ణుంచి మిమ్మల్నో కంట కనిపెడుతూనే ఉన్నాను. నేను జాంకాయలు కొంటున్నంతసేపూ జీవితంలో ఆడదాని మొహమే చూడనట్టు మీరు దానికేసి ఎంత ఆశగా చూశారో నేను గమనించ లేదనుకోకండి' అంది మూతి మూడు వంకర్లు తిప్పుతూ.

'వంకర బుద్ధి' అనుకున్నాను మనసులో.

'నాకలాంటి వంకర బుద్ధులు లేవు. నేనసలు ఆమెకేసి చూడనే లేదు. ఇది 'సూర్యుడు తూర్పున ఉదయించును' అన్నంత పచ్చి నిజం. అవునూ, ఉత్త పుణ్యానికి నా మీద ఇలాంటి నిందలేస్తున్నావ్ - ఆ అమ్మాయి అంత అందంగా వుందా ఏంటి?' అన్నాను.

'ఎందుకండీ అబద్ధాలాడ్తారు? పత్తికాయల్లా కళ్ళు విప్పుకుని చూశారుగా - మీ కళ్ళకి అదెంతందంగా కనిపించకపోతే అంత ఆశగా చూస్తారు?' అంది చరిత ఎడమచేతిని తలకాన్చుకుని మెటికలు విరుస్తూ.

'ఏమోనోయ్! నేనైతే ఆమెకేసి కన్నెత్తయినా చూడలేదు. కానీ నీ మాటల్ని బట్టి ఆమె చాలా అందగత్తే అయ్యుంటుందనిపిస్తోంది. ఈసారి గనక మళ్ళీ ఇటు కేసొస్తే పిలువ్. అప్పుడు నిజంగానే చూసి తరిస్తాను' అన్నాను జోక్ చేస్తూ.

కానీ తను దాన్ని జోక్‌గా రిసీవ్ చేసుకోలేదు.

'అయితే ఇందాక అంతిదిగా చూసినా కూడా ఇంకా ఆశ తీరలేదన్నమాట? మళ్ళీ వస్తే పిలవాల్నా? హు ఎంతైనా మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు' అంటూ కళ్ళ వెంబడి నిప్పులు రాల్చింది.

'ఓరి దేవుడోయ్ ఇదేంటీ?' అనుకున్నాను.

ఇప్పుడు గనక ఏ కారణం వల్లైనా మా మధ్య మాటామాటా పెరిగి తను గాని అలుక పానుపెక్కితే - అయ్యబాబోయ్ ఇంకేవన్నా ఉందా?

అసలు పస్తైనా ఓర్చుకోగలనేమో గానీ - ఇప్పుడున్న ఈ పరిస్థితిలో ఆ పస్తు...

ఊహామాత్రంగా అనుకున్నందుకే కంగారు పుట్టేసింది నాకు.

ఎం. ఐ. కిషన్

నో – అలా జరగటానికి వీల్లేదు.

'అదేంటి చరితా! నేనసలు ఆ అమ్మాయిని చూడనే లేదంటే నమ్మవేం...?' అన్నాను దీనంగా.

'అమాయకత్వం నటించి నన్ను మభ్యపెట్టాలని ఎందుకండీ చూస్తారు? అసలది ఏవంత బాగుందని...' నా మాటల్ని నమ్మకుండా చరిత ఇంకా ఏదో అనబోతుంటే నేను తనని మధ్యలోనే అడ్డుకున్నాను.

'నన్ను నమ్ము రీతూ! నీ మీద వొట్టు. నేను దాన్నసలు చూడనే లేదు' చెప్పింది నిజమే కాబట్టి నా కంఠంలో బోలెడంత సిన్సియారిటీ ధ్వనించింది.

కానీ చరిత దాన్ని గుర్తిస్తే గదా?

'పైగా దొంగ వొట్లు కూడానా? ఊఁఊఁ...' అంటూ వెటకారంగా చూసి విసవిసా వెళ్ళిపోయింది.

చాలా పెద్ద ఉపద్రవమే వచ్చి పడేలా ఉందని గ్రహించి నేను టీపాయ్‌ని తన్నుకుంటూ మరీ తన వెనుకే పరుగుతీశాను.

నేను చూస్తుండగానే తను కాస్తా మంచమెక్కేసి నిండా ముసుగు తన్నేసింది.

గుండె గుభేలుమనదా?

ఆర్రోజుల ఆరాటం... ఈరోజైనా తీర్చుకోకపోతే...? – మళ్ళీ ఆ ఊహకే గాభరా పుట్టేసింది.

ఇలాంటి సందర్భాలలో తనని ప్రసన్నురాల్ని చేసుకోవడానికి నాకున్నది ఒకటే ఒక్క మార్గం.

అందరు మొగాళ్ళూ ఏం చేస్తారో నాకు తెలీదు గానీ – నేను మాత్రం ఇటువంటప్పుడు తనని దార్లోకి తెచ్చుకోవడానికి ఆ ఒక్క మంత్రాన్నే ప్రయోగిస్తుంటాను.

'ఏంటి రీతూ! ఒట్టేసినా నా నిజాయితీని నమ్మకపోతే ఎలా? నీ మీద దొంగ వొట్లు వెయ్యగలిగేంత గుండె ధైర్యమా నాకు? నువ్వలా ముడుచుకుని పడుకుంటే నాకేం బాలేదు. లే – అలా షాపింగ్‌కి వెళ్ళొద్దాం' అన్నాను బుజ్జగింపుగా.

బీరువా నిండా చీరలున్నా – ఇంకా ఇంకా కొత్త చీరలు కావాలనే అనిపిస్తూ వుంటుంది తనకెప్పుడూ. కొత్త చీర కట్టుకుందంటే చాలు, ఆ రోజుకావిడ కొత్త పెళ్ళికూతురే. నాకు దొరికేవన్నీ కొత్తకొత్త రుచులే!

'షాపింగ్' అనే ఆ మూడక్షరాల మంత్రంతో తనెంత కోపంలో వున్నా తనని ఇట్టే ఫ్లీజ్ చేసెయ్యగలుగుతాను నేనెప్పుడూ.

'నాకేం అవసరం లేదు. నేను రాను' అంది ముసుగులోంచే బెట్టుగా.

కానీ నాకు అవసరం వుందిగా!

ఆ మాత్రం బెట్టు ఎప్పుడూ వుండేదేగా అనుకుని – 'రాకపోతే నష్టపోయేది నువ్వే. ఇవ్వాళ అమ్మాయిగారికి మినిమమ్ వెయ్యి రూపాయల చీరయినా కొనివ్వాలనుకుంటున్నాను. సువర్ణావకాశం. ఆలసించిన ఆశాభంగం' అన్నాను తన ముఖం మీంచి ముసుగుని లాగేస్తూ.

'నిజంగా మీరు దానికేసి చూడనే లేదా?' అంది స్ప్రింగులా లేచి కూర్చుంటూ.

'చూస్తే నా ప్రియసతీమణివైన నీ మీద వొట్టేస్తానా?' అన్నాను మోకాళ్ళ మీద మంచం పక్కనే కూర్చుంటూ.

'మరి నాకెందుకని అలా అనిపించిందబ్బా?' అంది బుగ్గన వేలుంచుకుంటూ.

'ఏమోనబ్బా! నేను మాత్రం నిరపరాధినబ్బా!' అన్నాను తన టోన్‌ని అనుకరిస్తూ.

అంతే!

ఫక్కున నవ్వేసింది.

ఆర్రోజుల విరామం తర్వాత – కొత్త చీరలో కొత్త పెళ్ళికూతురై పోయిన సతీమణితో, కాదు కాదు అపర రతీదేవితో – ఆ రాత్రి – నేను చవి చూసిన కొత్తకొత్త రుచులు...

ఎందుకులెండి?

చెబితే మీరంతా ఉడుక్కు చస్తారు – 'ఆహా! అదృష్టమంటే వీడిదే కదా' అని.

★ ★ ★

మర్నాడు పొద్దున్న నేను బ్రూత్‌బ్రష్ నోట్లో పెట్టుకుని మా పెరట్లోకి దారితీస్తుంటే–

కొత్తచీరలో అప్పుడే పెరటిగోడ పక్కన చేరిపోయిన మా ఆవిడ మా ప్రక్కింటి శ్రావణితో అంటూన్న మాటలు నా చెవిన పడ్డాయి.

'ఎందుకొదినా అంత ఆశ్చర్యపోతున్నావు? చూసి దెబ్బ కొట్టగలగాలే గాని – ఒకటేంటి, నాకి మొగుడి చేత నాలుగు కొత్త చీరలైనా కొనిపించుకోవచ్చు. అన్నట్టంతా చెప్పి అసలు సంగతి చెప్పనే లేదు కదూ? నిన్న నాకు జామకాయలమ్మింది నిజానికసలు అమ్మాయే కాదు – ఓ పన్నెండేళ్ళ కుర్రాడు'

మతిపోయింది నాకు.

'ఔరా! ఈ అతివలెంత గితివలు?' అనుకున్నా నాశ్చర్యంగా.


గితివలంటే ఏంటని మీరు బుర్ర బద్దలు కొట్టుకుంటారేమో – కోకండి.

మతిపోయిన వాడి మాటలకి అర్థం వుండి తీరాలనేముంది?

★

# వీనుల విందు

## మా బాలాజి




గతంలో అనేక హిట్ చిత్రాలనే కాకుండా కాస్త మంచిపాటలున్న చిత్రాలను అందించిన భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'మా బాలాజీ' చిత్రం క్యాసెట్ ఇటీవలే మార్కెట్‌లో విడుదలైంది. అయిదు పాటలున్న ఈ చిత్రానికి వందేమాతరం శ్రీనివాస్ సంగీతదర్శకుడు.

క్యాసెట్‌లోని తొలిపాట 'అందంగా జతకలిసింది' హుషారుగా సాగింది. ఇటువంటి హుషారుగా సాగే పాటలు పాడడంలో మనో, స్వరకల్పన చేయడంలో శ్రీనివాస్ నిష్ణాతులే కాబట్టి, సహజంగానే ఈ పాట మాస్‌ను ఆకట్టుకునే విధంగా తయారైంది. ఈ పాట వింటుంటే 'బావగారూ బాగున్నారా'లోని 'హల్లో అప్సర' పాట ఛాయలు గుర్తుకురావడం యాదృచ్ఛికమే కావచ్చు. క్యాసెట్ మొదటి భాగంలోని రెండ పాట 'గప్ చిప్ రోయ్' అంత క్యాచీగా లేదు. పైగా ఇది ఆ మధ్య వచ్చిన హూ..తూ..తూలోని పాటకు అనుకరణలా వుంది. మూడో పాట 'నీలిగగనంలో' మాత్రం క్యాసెట్‌కే హైలైట్. భువనచంద్ర రాసిన గీతాన్ని మనో, స్వర్ణలతతో కలిసి ఆలపించారు. ఈ గీతం అన్నివిధాలా బాగుంది.

క్యాసెట్ బి.సైడ్‌లోని 'నేడైనా రేపైనా' గీతం కూడా చాలా శ్రావ్యంగా ఉంది. 'సిరివెన్నెల' రాసిన ఈ పాటను స్వర్ణలత, రాజేష్ పాడారు. క్యాసెట్‌లో చివరి పాట 'అయీ..అయీ'ని నిత్యశ్రీ, స్వర్ణలత, శారద మల్లాది' పాడారు. మాస్ కోసం రూపొందించిన ఈ పాట అంతగా ఆకట్టుకోలేదు. ఈ పాటలో ఒకటి రెండు చోట్ల ఆ మధ్య హిట్ అయిన పాపులర్ పాప్ సాంగ్ 'ఆజ్ పియా...పియా...నలగె' లోని చరణాల్లా వినిపించడం విశేషం.

ఎర్ర చిత్రాలకే కాదు అన్ని చిత్రాలకు 'వందేమాతరం' శ్రీనివాస్ చక్కని బాణీలు సమకూర్చగలరని ఇప్పటికే రుజువైంది. కాని ఇనుస్ట్రుమెంటేషన్‌లో ఆయన ఇంకా మరిన్ని కొత్త పుంతలు తొక్కితే బాగుంటుంది...ముఖ్యంగా రొటీన్‌కు భిన్నంగా..

ఆదిత్య ఆడియో ద్వారా విడుదలైన క్యాసెట్ కవర్ ముచ్చటగా వుంది. క్వాలిటీ కూడా బాగుంది.

వి.ఎస్.ఎన్.మూర్తి